విశాఖ రాజధానికి ఓటేయండి

- వైఎస్సార్‌సీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ
- పార్టీ శ్రేణులతో కలిసి వార్డుల్లో విస్తృత ప్రచారం



19వవార్డులో ప్రచారంలో భాగంగా ఎంవీవీ సత్యనారాయణకు హారతి పడుతున్న మహిళ



17వ వార్డులో ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ లావణ్య, తదితరులు

ఎంవీపీ కాలనీ: విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ ఎన్నికల ప్రచారం ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా 92వ రోజు 19వ వార్డు పెదజాలరిపేటలో గురువారం పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విశాఖను రాజధానిగా ప్రకటించిందన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలిచిన వెంటనే ఇక్కడే ప్రమాణ స్వీకారం చేస్తానని, ఇక్కడి నుంచే పాలన సాగిస్తానని ముఖ్యమంత్రి జగన్ ఇప్పటికే ప్రకటించారని గుర్తు చేశారు. ఈ నేపథ్యంలో నగర ఓటర్లు విశాఖ రాజధానికి ఫ్యానగ్ గుర్తుపై ఓటు వేసి, తమ మద్దతు పలకాలని కోరారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమాన్ని, ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజాకర్షక పాలనను ఎంపీ వివరించారు. ప్రచారంలో భాగంగా ఎంవీవీకి ప్రతి ఇంట్లో మహిళలు హారతులు పడుతూ స్వాగతించారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు ఇన్‌చార్జి సూరాడ వెంకటలక్ష్మి, సూరాడ దాసు, తదితరులు పాల్గొన్నారు.

23వ వార్డులో ఎంవీవీ విస్తృత ప్రచారం

మద్దిలపాలెం : వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ 23వ వార్డులో గురువారం విస్తృత ప్రచారం చేశారు. స్థానిక కార్పొరేటర్ గుడ్ల విజయ సత్యారెడ్డితో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను ఎమ్మెల్యేగా, ఎంపీగా బొత్స ఝాన్సీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో మళ్లీ సంక్షేమ పాలన కొనసాగాలంటే ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రావాల్సి ఉందన్నారు. మళ్లీ సీఎంగా విశాఖలో జగనన్న ప్రమాణ స్వీకరణ చేసి, ఉత్తరాంధ్ర అభివృద్ధికి శ్రీకారం చుడతారన్నారు. విశాఖను రాజధాని చేస్తే ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని చెప్పారు. ఉత్తరాంధ్రను ఏనాడు పట్టించుకోని చంద్రబాబును చిత్తుగా ఓడించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జేసీఏ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, మహిళా నాయకులు, అభిమానులు, కస్టర్ల అధ్యక్షులు పాల్గొన్నారు.

17వ వార్డులో..

ఎంవీపీ కాలనీ: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరుతూ 17వ వార్డు కార్పొరేటర్ గేదెల లావణ్య పార్టీ 157 బూత్ కమిటీ సభ్యులతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఐదేళ్ల పాలనలో ప్రతి ఇంటికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మంచిని వివరించడంతో పాటు పేదల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తున్న తీరుపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా నగర ప్రజలకు ఇళ్ల స్థలాలు పంపిణీ, టిడ్కో ఇళ్ల కేటాయింపులు, మహిళల సంక్షేమానికి, కుటుంబ అవసరాలకు అనుగుణంగా అమ్మ ఒడి, ఆసరా, చేయూత వంటి పథకాలను వివరించారు. ఈ ఎన్నికల్లో తూర్పు ఎమ్మెల్యేగా ఎంవీవీ సత్యనారాయణను, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.



మద్దిలపాలెంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ తూర్పు అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ

క్లుప్తంగా

23న పోటీలు



షేక్స్‌పియర్ జయంతి పోస్టర్ ఆవిష్కరిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమార్

మద్దిలపాలెం : ప్రపంచ ప్రఖ్యాత రచయిత విలియమ్స్ షేక్స్‌పియర్ జయంతిని ఈ నెల 23న నిర్వహించనున్నామని డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. కళాశాలలో ఈ మేరకు పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 20న ఆంగ్ల భాషపై పోటీలు నిర్వహిస్తామన్నారు. 22న అధ్యాపకులు, విద్యార్థులకు షేక్స్‌పియర్ రచనలపై ఆన్‌లైన్ క్విజ్ నిర్వహించనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, ఆంగ్ల విభాగాధిపతి ఆర్.రాణి, అధ్యాపకులు కె.రవిబాబు, పి.ఉమామహేశ్వరరావు, ఆర్.కుసుమ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ: పైనాపిల్ కాలనీ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతులు చేపట్టనున్న కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలగనుంది. 33/11 కేవీ పైనాపిల్ కాలనీ ఎస్ఎస్‌వో 11 కేవీ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగింపు, మరమ్మతులు చేపట్టనున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పైనాపిల్ కాలనీ, కామాక్షినగర్, సీబీడీ కార్యాలయం, జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ, ఎస్ఎస్ఎన్ నగర్, శ్రీకృష్ణాపురం, రామకృష్ణాపురం, గోల్ఫ్ క్లబ్, ప్రాంతాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పేర్కొన్నారు.

గిరిజన గ్రామాల్లో 16,500 వీధి లైట్ల ఏర్పాటు

బీచ్ రోడ్డు: సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా ప్రతి రోజు సూర్యుడు పేరుతో గిరిజన గ్రామాల్లో ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేసినట్లు సిగ్నిఫై సంస్థ ప్రతినిధి నిఖిల్ గుప్తా తెలిపారు. గురువారం నగరంలోని ఒక హోటల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గిరిజన గ్రామాల్లో వెలుగులు నింపాలన్న ఉద్దేశంతో గ్రాస్ రూట్ ఎన్జీవో భాగస్వామ్యంతో 16,500 వీధి లైట్లను ఏర్పాటు చేశామన్నారు.

ఉక్కు సీఎండీని తొలగించాలని డిమాండ్



మాట్లాడుతున్న సీహెచ్ నరసింగరావు

దాబాగార్డెన్స్ : విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉత్పత్తి ప్రారంభించిన 33 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా మొదటి విభాగమైన కోక్ ఓవెన్‌కు అవసరమైన కోకింగ్ కోల్ కొరతను యాజమాన్యం సృష్టించిందని, అందుకు బాధ్యులైన స్టీల్ ప్లాంట్ సీఎండీ అతుల్‌భట్‌ను వెంటనే తొలగించాలని సిటు రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ నరసింగరావు డిమాండ్ చేశారు. పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోక్ ఓవెన్‌లో ముడిసరుకు అయిన 30 వేల టన్నుల కోకింగ్‌కోల్ గంగవరం స్టాక్ యార్డ్‌లో ఉందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు, గంగవరం పోర్టుకు మధ్య గోడే అడ్డుగా ఉందని, గంగవరం పోర్టులో ఉన్న కోకింగ్ కోల్‌ను విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు ఎందుకు రప్పించలేకపోయారని ప్రశ్నించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పూర్తిగా దెబ్బ తీయడానికి కేంద్ర బీజేపీ ప్రభుత్వం, గంగవరం పోర్టు యాజమాన్యం కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. దీనికి నిరసనగా ఈ నెల 21న స్టీల్‌ప్లాంట్ వద్ద కార్మిక గర్జన నిర్వహించనున్నట్టు చెప్పారు. సమావేశంలో సిటు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇలాయితే 'వెలగ' బెట్టేదెలా?

ఆరిలోవ: విశాఖ తూర్పు నియోజకవర్గంలో కూటమి తరపున బరిలో నిలిచిన టీడీపీ అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబుకు జనసేన, బీజేపీ నుంచి మద్దతు కరువైందన్న గుసగుసలు ఆరిలోవ ప్రాంతంలో వినిపిస్తున్నాయి. వెలగపూడి వెంట ఎక్కడా ప్రచారంలో ఆ పార్టీల కార్యకర్తలు కనిపించకపోవడంతో ఇందుకు బలం చేకూరుతోంది. ఇద్దరు, ముగ్గురు మాత్రమే ప్రచారంలో పాల్గొంటున్నారు. మిగతా వారు తటస్థంగా ఉండటంతో టీడీపీ నాయకులు నైరాశ్యంలో పడిపోయారు. కొందరు జనసేన, బీజేపీ నాయకులు వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నట్లు టీడీపీ నాయకులు భావిస్తున్నారు. మరో పక్క నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ ప్రచారంలో దూసుకుపోతోంది. మూడుసార్లు సాధారణ ఎన్నికల్లో విజయం సాధించిన టీడీపీకి ప్రస్తుతం ఉన్న పరిస్థితిలో ఈ సారి ఓటమి తప్పినట్లు లేదని ఆ పార్టీ నాయకులే గుసగుసలాడుకుంటున్నారు. దీంతో వెలగపూడి బీజేపీ, జనసేన నాయకుల తీరుపై అసంతృప్తితో ఉన్నట్లు టీడీపీ నాయకులు బాహాటంగా చెప్పుకుంటున్నారు.

గుస గుసలు

జన సమీకరణకు పాట్లు

ఆరిలోవ: తూర్పులో టీడీపీ అభ్యర్థి నామినేషన్‌కు జన సమీకరణ ప్రారంభమైంది. కార్యకర్తలు కరువవడంతో డబ్బులు ఇచ్చి జనాలను తీసుకెళ్లి బలం నిరూపించుకోవడానికి ప్రయత్నాలు మొదలయ్యాయి. శుక్రవారం కూటమి అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు కలెక్టరేట్‌లో నామినేషన్ వేయడానికి ముహూర్తం నిర్ణయించారు. మధ్యాహ్నం 2.30 గంటలకు నామినేషన్ వేయనున్నారు. ఆయన ఎన్నికల ప్రచారానికే కూటమి పార్టీల నాయకులు ముఖం చాటేస్తున్నారు. దీంతో నామినేషన్ అట్టహాసంగా చేయడానికి జనం లేకపోతే బలహీనపడతామనే ఆలోచనతో జన సమీకరణకు సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం శివాలజీపాలెంలో సవేరా ఫంక్షన్ హాల్‌లో వెలగపూడి టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ప్రతి వార్డు నుంచి 1000 మంది జనాన్ని నామినేషన్ కోసం తీసుకు రావాలని పార్టీ ఇన్‌చార్జులను ఆదేశించారట. ఆటోకు రూ.1,000, ఆటోలో ఎక్కిన వారికి రూ.200 చొప్పున, బైక్‌కు రూ.100(పెట్రోల్ కోసం), బైక్‌పై ఇద్దరు వ్యక్తులకు రూ.400(రూ.200 చొప్పున) ఇవ్వడానికి నిర్ణయించినట్లు తెలిసింది. ఈ సమావేశానికి బీజేపీ, జనసేన నాయకులు దుమ్మా కొట్టినట్లు సమాచారం.

నిరుద్యోగులకు అండగా నిలవాలి



వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మికి వినతి పత్రం అందిస్తున్న హేమంత్ కుమార్

బీచ్ రోడ్డు: గడిచిన ఐదేళ్లలో నిరుద్యోగులకు అండగా నిలిచి లక్షల ఉద్యోగాలు కల్పించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చిన తరువాత పెద్ద ఎత్తున జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలని రాష్ట్ర నిరుద్యోగుల జేఏసీ అధ్యక్షుడు హేమంత్ కుమార్ కోరారు. ఈ మేరకు ఎన్నికల ప్రచారంలో ఉన్న ఆ పార్టీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మిని గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. అర్హత కోల్పోయిన అభ్యర్థులకు సైతం గ్రేస్ మార్కులు వేసి 34 వేల మందికి సచివాలయంలో ఉద్యోగులు కల్పించిన ఘనత వైఎస్సార్‌సీపీకి దక్కుతుందన్నారు. నిరుద్యోగులకు ఎంతో చేసిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చట్ట సభల్లో కూడా అవకాశాలు కల్పించాలని కోరారు.

13వ వార్డులో ఆక్రమణల తొలగింపు



ఆలయం కోసం ఏర్పాటు చేసిన కంటైనర్‌ను తొలగిస్తున్న జీవీఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది



మసీదు జెండా కొయ్యను కట్ చేస్తున్న సిబ్బంది

ఆరిలోవ: ఆధ్యాత్మికం పేరుతో కొందరు 13వ వార్డులోని జీవీఎంసీ స్థలంలో చేపట్టిన నిర్మాణాలకు అధికారులు అడ్డుకట్ట వేశారు. ఆరిలోవ ఆఖరి బస్ స్టాప్ సమీపంలో కంబాల కొండ వెనక భాగాన్ని ఆనుకుని జీవీఎంసీకి చెందిన ఖాళీ స్థలం ఉంది. ఆ స్థలాన్ని ఇటీవల కొందరు చదును చేశారు. దానిలో రెండు వర్గాలకు చెందిన వారు వేర్వేరు ఆలయాల కోసం కంటైనర్లు ఏర్పాటు చేశారు. ఆ కంటైనర్లలో విగ్రహాలు పెట్టి పూజలు చేస్తున్నారు. వాటిని ఆనుకుని మసీదు కోసం మరికొందరు జెండా కొయ్యను కాంక్రీట్ వేసి పాతారు. ఈ నిర్మాణాలపై స్థానికుల నుంచి ఫిర్యాదులు అందడంతో జీవీఎంసీ అధికారులు రంగంలోకి దిగారు. గురువారం సాయంత్రం జోన్-2 ఏసీపీ శాస్త్రి, టీపీవో వరప్రసాద్, జీవీఎంసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది సంఘటన స్థలాన్ని పరిశీలించారు. అక్కడ ఆలయాల కోసం ఏర్పాటు చేసిన రెండు కంటైనర్లను తొలగించారు. పక్కనే మసీదు కోసం పాతిన జెండాను కట్ చేశారు. దీంతో ఆయా నిర్వాహకులు అక్కడికి చేరుకుని సిబ్బందిని అడ్డుకున్నారు. కొంతసేపు అధికారులతో వాగ్వాదం చేశారు. అయినా అధికారులు వారిపని వారు చేసుకుపోయారు. ఈ స్థలంలో అనుమతులు లేకుండా ఎలాంటి నిర్మాణాలు, ఇతర ఏర్పాట్లు చేపట్టకూడదంటూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తామని ఏసీపీ తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన సదస్సు

ఎంవీపీ కాలనీ: సైబర్ నేరాలపై ఎంవీపీ కాలనీ సమత కళాశాలలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ కంప్యూటర్, సెల్ ఫోన్ సాధనంగా జరిగే నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. స్మార్ట్‌ఫోన్ వినియోగంతో సైబర్ నేరాలు పెరిగిపోయాయన్నారు. ప్రూఫ్‌కి ఆధార్ కార్డు ఇవ్వడం వల్ల దేశంలో డేటా చోరీకి గురైందన్నారు. ఆన్‌లైన్‌లో జరిపే అన్ని రకాల లావాదేవీలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలు జరిగేందుకు అవకాశం ఉన్న పలు అంశాలను ఆయన విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

23న పోలమాంబ జాతర



మాట్లాడుతున్న ఈవో కె.గాయత్రి

ఏయూ క్యాంపస్: శ్రీకరకచెట్టు పోలమాంబ అమ్మవారి వార్షిక జాతరకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఈవో కె.గాయత్రి తెలిపారు. గురువారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ నెల 22న తొలేళ్ల ఉత్సవం, 23న అనుపు మహోత్సవం జరుగుతుందన్నారు. 23వ తేదీ ఉదయం 3 గంటల నుంచి భక్తులకు అమ్మవారి దర్శనం కల్పిస్తామని చెప్పారు. పంచామృతాభిషేకంలో పాల్గొనే భక్తులు రూ.1516 చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఉచిత దర్శనంతో పాటు ప్రత్యేక దర్శనం రూ.50, విశిష్ట దర్శనం రూ. 100, ప్రత్యేక లఘు దర్శనం రూ.500 క్యూలైన్లను ఏర్పాటు చేస్తామన్నారు. పోలీసు, జీవీఎంసీ, వైద్యారోగ్య శాఖ, వలంటీర్లు, ఆలయ సిబ్బంది సహకారంతో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తాగునీరు, మజ్జిగ, ఉచిత ప్రసాదం పంపిణీ చేస్తామని చెప్పారు. చంటి పిల్లల తల్లులు, 80 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ప్రత్యేక దర్శనానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భద్రత కోసం సీసీ కెమెరాలతో నిరంతరం పర్యవేక్షిస్తామని ఆమె వివరించారు. ఈ సమావేశంలో పురోహితులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సుభోజనం కౌంటర్ పునరుద్ధరణకు శ్రీకారం



సుభోజనం కౌంటర్ పనులకు శంకుస్థాపన చేస్తున్న డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం. చిత్రంలో డాక్టర్లు అశోక్‌కుమార్, బుచ్చిరాజు తదితరులు

మహారాణిపేట : కేజీహెచ్‌లో సుభోజనం కౌంటర్ పునరుద్ధరణకు గురువారం శంకుస్థాపన చేశారు. రోగుల సహాయకుల సంఖ్య రోజురోజుకు పెరగడంతో వారి కోసం సుభోజనం కౌంటర్ ఎదురుగా ఖాళీ స్థలంలో తాత్కాలిక షెడ్ నిర్మిస్తున్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డీఎంఈ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం అంకురార్పణ చేశారు. గత 12 సంవత్సరాల నుంచి అల్పాహారం, రెండు పూటల భోజనాలు పెడుతున్న హరేకృష్ణ మూవ్‌మెంట్, టచ్‌స్టోన్ చారిటీస్‌కు ఒక ఏడాది కాలం పాటు అన్నదానం చేయడానికి ఇండో ఎంఐఎం సంస్థ ముందుకు వచ్చింది. ఈ రోజు నుంచి వచ్చే ఏడాది ఏప్రిల్ 17 వరకు రోజుకు 400 మంది రోగి సహాయకులకు భోజనం కోసం ఇండో ఎంఐఎం సంస్థ విరాళం ఇచ్చింది. ఈ కార్యక్రమాన్ని ఎంఐఎం కంపెనీ సీఈవో విజయకుమార్ గురువారం లాంఛనంగా ప్రారంభించారు. కంపెనీ ముఖ్య కార్యనిర్వహణాధికారి విజయకుమార్, ఆంధ్రా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, డిప్యూటీ సూపరింటెండ్ డాక్టర్ రాధాకృష్ణ, హరేకృష్ణ మూవ్‌మెంట్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్. భక్తదాస, జాతీయ అవార్డు గ్రహీత ఆర్. రవికుమార్, యదురాజా దాస, గోపీశ్వర దాస, శ్యామా మాధవ దాస, జీతమిత్ర దాస, సమన్వయకర్త పి.షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో 10 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ

బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించనున్న ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దరిని అనుమతించనున్నట్టు ఈవో పి. శ్రీనివాసులరెడ్డి చెప్పారు. పై పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు

- మళ్లీ సీఎంగా జగనన్నను ఆశీర్వదించండి
- 16వ వార్డు సిద్ధం సభలో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవీవీ



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ

మద్దిలపాలెం : సంక్షేమ రథసారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ఆశీర్వదించాలని విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ పిలుపునిచ్చారు. జీవీఎంసీ 16వ వార్డులో మేము సిద్ధం మా బూత్ సిద్ధం సభ వెంకోజీపాలెంలో గురువారం కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, పార్టీ తూర్పు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఎంవీవీ మాట్లాడుతూ ఐదేళ్లలో రాష్ట్రంలో సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలు లక్షలాది మంది పేదల జీవితాల్లో వెలుగులు నింపాయన్నారు. దీంతో ముఖ్యమంత్రిగా మళ్లీ జగన్ననే చేయాలని వేయి కళ్లతో జనం ఎదురు చూస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీని అఖండ మెజార్టీతో గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. తూర్పు నియోజకవర్గంలో గత ఐదేళ్లలో జరిగిన అభివృద్ధిని ప్రజలు గుర్తిస్తున్నారని చెప్పారు. మౌలిక సదుపాయాలతో పాటు, విద్య, వైద్య రంగాలకు కావాల్సిన భవనాల నిర్మాణం, రోడ్లు, కాలువలు, గెడ్డల ఆధునీకీకరణ, ఇలా కోట్లాది రూపాయలతో అమోఘమైన అభివృద్ధి జరిగిందన్నారు. ఏ కాలనీ చూసిన కొత్త తారురోడ్లు, సీసీ రహదారులతో కళకళలాడుతున్నాయన్నారు. అభివృద్ధి, సంక్షేమాన్ని అందించిన వైఎస్సార్‌సీపీ సర్కారుకు మద్దతుగా నిలుస్తూ ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తనను ఎమ్మెల్యేగా, బొత్స ఝాన్సీని ఎంపీగా గెలిపించాలని ఎంవీవీ కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి పి.నారాయణ, ఎస్సీ విభాగం నాయకుడు అల్లంపల్లి రాజబాబు, మహిళా అధ్యక్షురాలు కృపాజ్యోతి, చొల్లంగి నాగేశ్వరరావు, క్లస్టర్ అధ్యక్షులు, వార్డు అధ్యక్షులు, మహిళా నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



సిద్ధం సభకు హాజరైన ప్రజలు

పోర్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మహారాణిపేట : అదానీ గంగవరం పోర్టు కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కారించాలని, విశాఖ స్టీల్ ప్లాంట్‌కి కోకింగ్ కోల్ సరఫరాకు తగిన చర్యలు తీసుకోవాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. గురువారం విశాఖ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోర్టు వల్ల సర్వస్వం కోల్పోయిన నిర్వాసితులైన గంగవరం, దిబ్బపాలెం గ్రామాలకు చెందిన 600 కుటుంబాలకు పోర్టులో కాంట్రాక్టు ఉద్యోగాలు ఇచ్చారని, 10 ఏళ్లుగా పని చేస్తున్నా రూ.15 వేలకు మించి వేతనం ఇవ్వడం లేదన్నారు. స్టీల్ ప్లాంటు ప్రైవేటీకరణపై క్యాబినెట్‌లో తీర్మానం చేయలేదన్నారు.

నొప్పిలేని సుఖ ప్రసవం కోసం ఏంటోనాక్స్



అధునాతన ఏంటోనాక్స్ పరికరం పనితీరు వివరిస్తున్న అనిల్ నీరుకొండ వైద్యులు

తగరపువలస: సంగివలస అనిల్ నీరుకొండ మెడికల్ సైన్సెస్ ప్రసూతి విభాగంలో ఏంటోనాక్స్ అనే అధునాతన పరికరాన్ని గురువారం పరిచయం చేశారు. ఈ సందర్భంగా డీన్ డాక్టర్ పీవీ సుధాకర్ మాట్లాడుతూ ఈ పరికరం ద్వారా నొప్పలేని సాధారణ ప్రసవాన్ని చేయవచ్చన్నారు. దీని ద్వారా సిజేరియన్ ఆపరేషన్లు గణనీయంగా తగ్గుతాయన్నారు. ఈ పరికరాన్ని ముగ్గురు మహిళలపై ప్రయోగించగా వారు ఆనందం వ్యక్తం చేశారన్నారు. విశాఖ పరిసర ప్రాంతాల్లో ఎక్కడా లేని నూతన ప్రక్రియ వల్ల తల్లులు నొప్పి లేకుండా సుఖప్రసవం పొందుతారన్నారు. ఈ పరికరం తయారీ కోసం శ్రమించిన వైద్యులు ఉమ, చైత్రలను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీధరరెడ్డి, డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ సుజాత, రత్నకుమారి, పీడియాట్రిక్స్ విభాగాధిపతి డాక్టర్ ప్రతిమాదేవి, ప్రసూతి వైద్య విభాగాధిపతి డాక్టర్ ఉమ, పాథాలజీ విభాగాపతి డాక్టర్ భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

జగదాంబ : గుర్తు తెలియని మృతదేహం గురించి గురువారం హార్బర్ పోలీసులకు సమాచారం అందింది. వివరాలు ఇలా ఉన్నాయి. పోర్టులోని ఎఫ్ఆర్పీ టెక్ కంపెనీలోని వంతెన నిర్మాణ పనుల వద్ద వానపల్లి సత్యనారాయణ అనే వ్యక్తి సెక్యూరిటీ గార్డుగా పని చేస్తున్నాడు. అతను కాలువ వద్దకు కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లగా అక్కడ గుర్తు తెలియని మృతదేహాన్ని చూశాడు. వెంటనే పోర్టు స్టేషన్‌కు ఫిర్యాదు చేయడంతో పోలీసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేశారు. మృతుడు 5 అడుగుల 5 అంగుళాల ఎత్తు, తెల్లని ఛాయతో ఉన్నాడని పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9440796013 నంబర్‌కు సమాచారం అందజేయాలని హార్బర్ పోలీసులు తెలిపారు.